మీసం మెలేస్తున్న రొయ్యి

- 100 కౌంట్ కిలో రూ.260
- తెగుళ్లతో క్షీణించిన ఉత్పత్తి
- గత వర్షాలకే చెరువుల ఖాళీ
- పెరుగుతున్న ధరలు, రైతుల్లో అసంతృప్తి

కాజులూరు: గత సంవత్సర కాలంగా అడుగంటిపోతున్న రొయ్యల ధరలు రెండు వారాలుగా రోజు రోజుకీ ఎగబాకుతున్నాయి. గత నెల రోజుల క్రితం రూ.190గా ఉన్న 100 కౌంట్ ధర ప్రస్తుతం రూ.260గా, గత నెల రోజుల క్రితం రూ.420గా ఉన్న 30 కౌంట్ ధర ప్రస్తుతం రూ.475గా ఉంది. రేటు అనూహ్యంగా పెరుగుతున్నప్పటికీ రైతుల్లో మాత్రం ఆనందం కరువైంది. ఇటీవల కొద్దినెలలుగా వరుసగా వైట్‌స్పాట్, ఈహెచ్‌పీ వైరస్‌లు

రొయ్యల ధరలు నెల రోజుల క్రితం ధరలకు, ప్రస్తుతం ధరలకు వ్యత్యాసం ఇలా..

కౌంట్	ప్రస్తుతం ధర	నెలరోజుల క్రితం
30	475	420
35	385	335
40	375	325
50	340	285
60	320	250
70	300	230
80	280	210
90	270	200
100	260	190


పట్టుబడి చేసిన 100 కౌంట్ రొయ్యలు


గత నెలలో కాజులూరులో వైరస్ బారిన పడి చనిపోతుండటంతో తక్కువ సైజులోనే రొయ్యలను పట్టుబడి చేస్తున్న రైతులు

రొయ్యల సాగుపై విరుచుకుపడటంతో సీడ్ వేసిన 30 రోజులు, 45 రోజుల వ్యవధిలోనే చెరువులు ఖాళీ అవుతున్నాయి. వైట్‌స్పాట్ వైరస్ సోకితే ఒకటి లేదా రెండురోజుల్లో పట్టుబడి పట్టాలి. లేనిపక్షంలో రొయ్య చనిపోయి నేలనంటుతుంది. ఈహెచ్‌పీ వైరస్‌తో సోకితే రొయ్య వైట్‌గట్ వ్యాధికి గురై ఎదుగుదల ఆగిపోయింది. ఇదే పరిస్థితి జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఉంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులకు వైట్‌స్పాట్ విజృంభించింది. దానికి తోడు ఈహెచ్‌పీ వైరస్‌తో వైట్‌గట్ వ్యాధి సోకి రొయ్యలు ఎదుగుదల నిలిచిపోయింది. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితులలో పట్టుబడులు పట్టాల్సి వచ్చింది. దీనిని అదనుగా తీసుకుని దళారులు, వ్యాపారులు ధరలు పూర్తిగా తగ్గించి కొనుగోలు చేశారు. రొయ్యలు వ్యాధుల బారిన పడి అన్ని ప్రాంతాల నుంచి పట్టుబడులు జరిగి మార్కెట్‌లోకి ఒకే సమయంలో సరకు ఎక్కువగా రావటంతో వ్యాపారులు ధర అమాంతంగా తగ్గించి కొనుగోలు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో పట్టుబడి పట్టి అయినకాడికి అమ్ముకున్న రైతులు తదుపరి పంట వేయాలా, వద్దా అన్న సందిగ్ధంలో ఉండిపోయారు. సాహసించి కొందరు రైతులు చెరువుల్లో మరోసారి సీడ్ వేసినా వాతావరణ పరిస్థితులు అనుకూలించక నెల తిరగకుండానే మరలా అతి తక్కువ కౌంట్‌లో పట్టుబడి పట్టాల్సి వస్తోంది. దాదాపు ఏడెనిమిది నెలల తర్వాత ఇప్పుడిప్పుడే రొయ్యల ధరలు పెరుగుతున్నాయి. సరకు ఎక్కువగా వచ్చే సమయంలో వ్యాపారులు ధరలు తగ్గించి కొంటున్నారని ప్రస్తుతం తెగుళ్ల కారణంగా ఉత్పత్తి తగ్గడంతో


మొగలిపాలెంలో నెల రోజుల కిత్రం పట్టుబడి పట్టి ప్రస్తుతం ఖాళీగా ఉన్న రొయ్యల చెరువులు

ధరలు పెంచారని రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి సరకు ఎక్కువగా వచ్చే సమయంలోనూ ధరలు తగ్గిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆక్వా రైతులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డు, పందుల పాకలు తొలగించాలి

కె.గంగవరం: మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాల పక్కనే ఉన్న డంపింగ్ యార్డుతో పాటు పామర్రు–కూళ్ల రహదారిలో ఉన్న పందుల పాకలను తొలగించాలని కోరుతూ పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, పామర్రు, కూళ్ల, అముజూరు గ్రామస్తులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద రోడ్డుపై టెంట్ వేసి సుమారు రెండు గంటల పాటు ధర్నా చేశారు. పాఠశాల పక్కనే గత కొన్నేళ్లుగా చెత్త తీసుకువచ్చి వేస్తున్నారని దీని ద్వారా విద్యార్థులు అనారోగ్యాల పాలవుతున్నారని వారు చెబుతున్నారు. దీంతో పాటు పాఠశాలకు కూత వేటు దూరంలో ఉన్న పందుల పాకల వల్ల దుర్వాసన రావడంతో పాటు పందులు స్వైర విహారం చేసి పాఠశాల ఆవరణను అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నోసార్లు వాటిని తొలగించాలని అధికారులకు విన్నవించుకున్న కనీసం పట్టించుకోలేదని దీంతో నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. పామర్రు పంచాయతీ కార్యదర్శి సీతారామయ్య చౌదరి వెంటనే డంపియార్డును తొలగిస్తామని ఇక్కడ ఎవరు చేత్త వేయకుండా కంచె ఏర్పాటు చేశామని నిరసనకారులకు తెలిపారు. దీంతో పాటు పందుల పాకల నిర్వాహకులు కూడా వచ్చి విద్యార్థులకు, గ్రామస్తులకు ఇబ్బందిగా ఉన్న


పామర్రులో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కారణంగా పాకలను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో నిరసనకారులు ధర్నా విరమించారు. అయితే గత కొన్నేళ్లుగా పందులు మేపుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని ఇప్పుడు వీటిని తొలగిస్తే మాకు జీవనాధారం లేకుండా పోతుందని పందుల పెంపకందారులు అధికారుల వద్ద ఆవేదన చెందారు. ఎక్కడైన స్థలం చూపిస్తే వెంటనే అక్కడకు వెళ్లి జీవనోపాధి కొనసాగిస్తామన్నారు. పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పందుల గుడిసెలకు కావాల్సిన స్థలం చూస్తామని హామీ ఇచ్చారు. అముజూరు, పామర్రు గ్రామ పెద్దలు మరివాడ సూరిబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, యనుమల రామకృష్ణ, మరివాడి చిన్నికృష్ణ, పెంకే నాగేశ్వరరావు తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

మాచవరంలో పప్పుదినుసుల క్లస్టర్

- పనులను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్
- మూడు నెలల్లో వినియోగంలోకి తేవాలని ఆదేశం

రాయవరం: మండలంలోని రూపుదిద్దుకుంటున్న మాచవరం పప్పు దినుసుల క్లస్టర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్ పరిశీలించారు. ఈ నెలాఖరులోగా యంత్రాల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. మరో మూడు నెలల్లోగా క్లస్టర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని మాచవరంలో నిర్మిస్తున్న పప్పు దినుసుల క్లస్టర్ (పల్సస్ క్లస్టర్)ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతాల్లో చిన్న పప్పు దినుసుల మిల్లులు నడిపే వారు స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేసుకుని రూ.14.83 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతో ఈ పప్పు దినుసుల క్లస్టర్‌ను నిర్మిస్తున్నారన్నారు. ఈ నిర్మాణంలో 70 శాతం కేంద్ర ప్రభుత్వం వాటా, 20 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా కాగా మిగిలిన 10 శాతం ఎస్‌పీవీ వాటా అని వివరించారు. జర్మన్ సాంకేతికతో


మాచవరంలో నిర్మిస్తున్న పప్పు దినుసుల క్లస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

నిర్మితమవుతున్న క్లస్టర్‌లో పప్పు దినుసులను శుభ్రపరచడం, పాలిష్ చేయడం, వ్యర్థాలను తొలగించడం, కలర్ గ్రేడింగ్ ప్యాకేజింగ్ వంటివి ఆటోమేటిగ్గా జరిగిపోతాయన్నారు. ఈ పల్సస్ క్లస్టర్ అందుబాటులోకి వస్తే సుమారు 150 మంది చిన్న పప్పు దినుసుల మిల్లులు నిర్వహించేవారు లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. వందమందికి పైగా ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ఇప్పటికే షెడ్ నిర్మాణం, సివిల్ పనులు, యంత్రాల సరఫరా పూర్తయ్యాయని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ డీకే పీ ప్రసాద్, ఆర్డీవో సుధాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

కాజులూరు: గ్రామంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీవీ సత్యనారాయణ (వీరబాబు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబరు సోము వీర్రాజు సంయుక్తంగా వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి పాలనలో దేశం ఎంతగానో పురోగతి సాధించిందన్నారు. అనంతరం దేశ అభివృద్ధికి, పార్టీ పురోగతికి వాజ్‌పేయి చేసిన కృషిని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే


వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సోము వీర్రాజు తదితరులు

అయ్యాజి వేమా, పార్టీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు నియోజకవర్గ బీజేపీ, జనసేన కన్వీనర్లు దూడల శంకరనారాయణమూర్తి, పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పుష్కర ఘాట్లు

కె.గంగవరం: ఇటీవల గోదావరికి వచ్చిన గోదావరి ఉధృతికి మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు ఉన్న పుష్కర ఘాట్లు నీటమునిగాయి. అయితే గోదావరికి వరద తగ్గడంతో పుష్కర ఘాట్లు బురదమయంగా మారాయి. ఆయా గ్రామాల్లోని శివాలయాలు, ఇతర దేవాలయాలకు వెళ్లే భక్తులు ఆయా గ్రామాల్లోని పుష్కర ఘాట్ల వద్ద గోదావరి స్నానం ఆచరిస్తారు. అయితే ఈ ఘాట్లు బురదమయంతో పాటు చెత్తతో ఉండి అపరిశుభ్రంగా ఉండడంతో ఎవరు గోదావరి స్నానానికి వెళ్లడం లేదని స్థానికులు వాపోతున్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి పుష్కరాలకు ఘాట్లు నిర్మించారు. కానీ పర్యవేక్షణ లేకపోవడంతో అవి పాడైపోతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. పంచాయితీ అధికారులకు విన్నవించుకున్న పట్టించు


మసకపల్లిలో అధ్వానంగా మారిన పుష్కరఘాట్

కోవడం లేదని భక్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఘాట్లను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి భక్తులకు సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరాల తల్లిని కొలిసిరి

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతమాచరించిన మహిళలు
- ముత్తైదువలకు వాయనాల సమర్పణ

రాయవరం: నవ్వుల సిరులు వెల్లివిరిశాయి. ఆనందాలు అంబరాన్నంటాయి. శ్రావణ మాసం, రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఇంటింటి మహాలక్ష్ములు చల్లని తల్లి వరలక్ష్మిని భక్తితో కొలిచారు. ప్రత్యేక పూజలు చేసి వ్రతమాచరించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం

లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం .. శ్రీరంగ ధామేశ్వరీం.. దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం' అంటూ మహిళా లోకం సిరుల తల్లికి ప్రణమిల్లింది. శ్రావణ మాసం శుక్ల పక్షంలో పౌర్ణమి ముందు వచ్చే వరలక్ష్మీ వ్రతాన్ని అనాదిగా మహిళలు ఆచరిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించారు. పలువురు మహిళలు అష్టోత్తర శతనామాలతో వరలక్ష్మీదేవిని పూజించి షడ్రసోపేతమైన మహా నైవేద్యాన్ని అమ్మవారికి నివేదించారు. అనంతరం చుట్టుపక్కల ఉన్న ముత్తైదువులను పిలిచి వాయనాలు, తాంబూలాలు అందజేశారు. సాయంత్రం సమయంలో వ్రతమాచరించిన మహిళలు దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలు దేవాలయాలు ముఖ్యంగా దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయాలను అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పలు ఆలయాలు కళకళలాడాయి. పలు ఆలయాల్లో అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, విశేషాలంకరణ చేశారు.


సోమేశ్వరంలో విశేషాలంకరణలో శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి


గొల్లపాలెం దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సకల శుభాలకు మూలం

శ్రావణమాసం సకల శుభాలకు కారణమని మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) అన్నారు. శుక్రవారం పీఠంలో భక్తులు సామూహిక శ్రావణ వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి గాడ్ మాట్లాడుతూ నిత్యపూజలందుకునే వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రంతో కూడిన శ్రావణ మాసంలో వ్రతాలు ఆచరించడం అనాదిగా వస్తోందన్నారు. శ్రావణమాసంలో అష్టలక్ష్మిల రూపమైన వరలక్ష్మిని పూజించడంతో సకల సంపదలు కలుగుతాయని గాడ్ సూచించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని పీఠంలో విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠంలో వెండితో చేసిన అష్టలక్ష్మీ కలశాన్ని ఏర్పాటు చేసి పురోహితులు మహిళలతో గౌరీపూజ, వరలక్ష్మీ అమ్మవారికి అష్టోత్తర సహస్ర నామాలతో కుంకుమ, పుష్పాలతో పూజలు చేశారు. పీఠానికి హాజరైన భక్తులకు పీఠం ప్రతినిధుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.


ప్రత్యేకాలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు ఆలయాల వద్ద అమ్మవారి దర్శనానికి మహిళలు బారులు తీరారు. ద్రాక్షారామలోని భీమేశ్వరాలయంలో కొలువైన మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. క్యూలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. నరసాపురపుపేట, ఓదూరు, ఉండూరు, చోడవరం, వెంకటాయపాలెం, తాళ్లపాలెం తదితర గ్రామాల్లో దుర్గమ్మ అమ్మవార్ల ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. ద్రాక్షారామలోని కోటిపల్లి రోడ్డులోని కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద దర్శనానికి మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరారు. రాత్రి వరకు అమ్మవారి దర్శనానికి మహిళా భక్తులు వేచి ఉన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: నియోజకవర్గంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం కావడంతో పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఇంటివద్ద వ్రతమాచరించిన మహిళలు సాయంత్రం వేళల్లో ఆలయాలు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని శివాలయం వీధిలోని కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయం, కొత్తూరు రోడ్డులోని అమ్మవారి ఆలయంల్లో మహిళలు విశేష కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోదండరామాలయంలో అమ్మవార్లను ప్రత్యేకాలంకరణ గావించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారిలోని జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరిచుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు కుంకుమ పూజలు చేసి వ్రతాలను ఆచరించారు. ఆలయ అర్చకులు మహిళలతో ప్రత్యేక పూజలు చేయించారు.

కాజులూరు: శ్రావణమాసం వచ్చిందంటే చాలుఅమ్మవారి ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడుతుంటాయి. ప్రధానంగా శ్రావణపౌర్ణమి ముందుగా వచ్చే శుక్రవారం వరలక్ష్మీ అమ్మవారి వ్రతాన్ని మహిళలు ప్రత్యేకంగా ఆచరిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం కాజులూరు మండల గ్రామాల్లో పలువురు మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి ఆలయాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని 26 గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లోను ప్రత్యేక పూజలు జరిగాయి.

క్లుప్తంగా

గోదావరి గట్టును పరిశీలించిన డీఈ


కోరుమిల్లి వద్ద గోదావరి గట్టును పరిశీలిస్తున్న డీఈ సుబ్బారావు తదితరులు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి వద్ద బలహీన పడిన గోదావరి గట్టును ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ డీఈ కె.సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. ఇటీవల వరదల సమయంలో కలెక్టర్ మహేష్‌కుమార్ గట్టును పరిశీలించారు. ఆయన ఆదేశాలపై ఇసుక మూటలతో గట్టును తాత్కాలికంగా పటిష్ట పరిచారు. కాగా డీఈ సుబ్బారావు గట్టును పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెడ్‌వర్క్స్ ఏఈ కాశీ విశ్వేశ్వరరావు జేఈ ఎం.రెహమాన్ ఉన్నారు.

నేడు అంగరలో యోగాపై అవగాహన సదస్సు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఉచిత యోగా శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. విశ్వ మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహించే శిబిరంలో మధుమేహం, కీళ్లనొప్పులు, బీపీ, ఆస్తమా, ఫిట్స్, క్యాన్సర్, స్త్రీల సంబంధిత వ్యాధులు గల వారిని పరీక్షించి ఉచితంగా హోమియో మందులు అందజేస్తామన్నారు.

మండపేట ఎంపీడీవో శ్రీదేవి బదిలీ



మండపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఆర్. శ్రీదేవి శుక్రవారం బదిలీ అయ్యారు. ఆమె పశ్చిమ గోదావరి జిల్లా నుంచి సార్వత్రిక ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించేందుకు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించి అందరి మన్ననలూ పొందారు. తాజా బదిలీల్లో భాగంగా శ్రీదేవి సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న వి.ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. కొత్త ఎంపీడీవో వచ్చేంత వరకూ ప్రసాద్ విధులు నిర్వహించనున్నారు.

రాయవరం ఎస్సైగా బుజ్జిబాబు బాధ్యతల స్వీకరణ




రాయవరం: స్థానిక పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా పి.బుజ్జిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.సాధారణ బదిలీల్లో భాగంగా బిక్కవోలు స్టేషన్ నుంచి ఆయన రాయవరం స్టేషన్‌కు రాగా, ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఎస్సై జి.నరేష్ వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై బుజ్జిబాబు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

అన్న క్యాంటీన్ పునఃప్రారంభం


అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

మండపేట: పట్టణంలోని ఏడిద రోడ్డులో అన్న క్యాంటీన్ పునః ప్రారంభమైంది. ఈ క్యాంటీన్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ కలసి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ వారిద్దరూ టిఫిన్లు వడ్డించారు. అనంతరం వారు కూడా టిఫిన్లు రుచి చూశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తిరిగి అన్న క్యాంటీన్లను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలో అక్రమంగా ట్రాక్టర్‌పై ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో స్థానిక వీఆర్వో కొల్లు నరసింహమూర్తి తన సిబ్బందితో గురువారం రాత్రి పట్టుకుని అయినవిల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి తదుపరి చర్యల కోసం తహసీల్దార్ కార్యాలయానికి అప్ప గించారు. మొదటి తప్పుకింద ట్రాక్టర్ యజ మాని కుంచే సత్యనారాయణ నుంచి రూ.3 వేలు అపరాధ రుసుం వసూలు చేసినటుల్ ట్రాక్టర్‌ను వదిలిపెట్టినట్లు తహసీల్దార్ శ్రీవల్లి తెలిపారు.

ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన


కపిలేశ్వరపురం ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కృష్ణమూర్తి తదితరులు

కపిలేశ్వరపురం: స్థానిక ఇసుక స్టాక్ పాయింట్‌ను గనులశాఖ ఏజీ జి.కృష్ణమూర్తి శుక్రవారం పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టాక్ పాయింట్‌లో ఇసుక విక్రయాలను తనిఖీ చేసే నిమిత్తం కృష్ణమూర్తి వచ్చారు. ఇసుక నిల్వలు, తరలింపు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, స్టాక్ పాయింట్‌లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో చర్చించారు. ఇప్పటికే తాతపూడి ఇసుక స్టాక్ పాయింట్‌లోని ఇసుక తరలింపు పూర్తయ్యింది. కపిలేశ్వరపురంలోని ఇసుక మరో వారం రోజుల్లో పూర్తయ్యే అవకాశాలున్నాయి.

భారతమాత విగ్రహ ఆవిష్కరణ


భారతమాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రపురం: పట్టణంలో శివాలయం ఎదురుగా ఉన్న పార్కు వద్ద భారతమాత విగ్రహాన్ని గురువారం బీజేపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆవిష్కరించారు. పట్టణంలో భారతమాత విగ్రహావిష్కరణ ఆనందదాయకమని బీజేపీ నాయకులకు కార్యకర్తలకు దేశభక్తి ఎక్కువ అని దేశాన్ని దేశ ప్రజలను ఎప్పుడూ గౌరవించడం బీజేపీ పార్టీకి సంప్రదాయమని దొరబాబు అన్నారు. కార్యక్రమంలో విగ్రహం ఏర్పాటు చేసిన సలాది సతీష్ నాయుడుని ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమా, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, బీజేపీ సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, అడబాల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పలివెల రాజు పాల్గొన్నారు.

అలీ అస్గర్‌కి ఘన నివాళి


ద్రాక్షారామలో అలీ అస్గర్‌కు నివాళిగా జూలా ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: ఇమామ్ హుస్సేన్ తనయుడు అలీ అస్గర్‌ను హర్మలా అనే రాక్షసుడు బాణంతో చంపిన విషాద సంఘటనను తలచుకుంటూ శుక్రవారం ద్రాక్షారామలో ముస్లింలు ఆగా వారి పెద్ద పంజా నుంచి పంజాషా వరకు జూలా(ఊయల) ఊరేగింపు నిర్వహించారు. ఇరాన్‌లోని ఖుమ్ నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా అయతుల్లాహ సయ్యద్ సిబ్ టైన్ అబ్బాస్ రిజ్వీ సాహెబ్ ఖిల్లా హౌజయే ఇల్మియా మజ్లిస్‌లు ఆలపించారు. అంజుమన్ ఇ సిఫాహ్ ఈ అలీ అస్గర్ ద్రాక్షారామ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగరం, ముమ్మిడివరం, అమలాపురం, చెయ్యేరు, చేదువాడ, విశాఖపట్నం, కాకినాడ, తాళ్లరేవు, జగ్గన్నపేట, మండపేట, రామచంద్రపురం మండలంలోని పలు గ్రామాల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

కపిలేశ్వరపురం: స్థానిక రెండో నంబర్ సచివాలయాన్ని ఎంపీడీఓ కొండలరావు శుక్రవారం సందర్శించారు. కార్యదర్శి శివ చక్రవర్తి తదితర స్థానిక అధికారులతో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై చర్చించారు. పల్స్ సర్వేను సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల ప్రభావం ఉన్నందున పారిశుధ్య చర్యలను మరింత మెరుగుపరచాలన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు


అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్ తదితరులు

రామచంద్రపురం: పేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం పాత బస్టాండ్ సెంటర్ వద్ద శుక్రవారం అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌తో కలసి మంత్రి సుభాష్ అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం 100 అన్న క్యాంటీన్లు పునః ప్రారంభమయ్యాయని అన్నారు. ఇక్కడ సుమారు 350 మందికి రోజూ పూటకు కేవలం రూ.ఐదుకే అల్పాహారం, మధ్యాహ్నం సాయంత్రం నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందిస్తామన్నారు. ఒకవేళ తాకిడి ఎక్కువైతే అందరికీ భోజనం అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు, వలస కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు ప్రతిరోజూ అల్పాహారం, భోజనం అందుబాటులో ఉంచుతామన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్న క్యాంటీన్లో ఎవరైనా భోజనం చేయవచ్చన్నారు. రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, అన్న క్యాంటీన్ల నిర్వాహకులు పాల్గొన్నారు.